866) సుమనసరంజని

ప॥ ఎంత మన్నించితో యీ యింతినిదె నీవు। అంతకంతకు ప్రేమనలరీనిపుడు॥

చ॥ పడతి నాట్యశ్రాంతి పవళించి తొల్లి నీ-। తొడలపై నీవు తల దువ్వగాను।
కడలేని యిటువంటి కళలు దలచే కదా। విడువని వియోగమున వేగీనిపుడు॥

చ॥ ఒనర కుచభారమున నొరగి యీ మలగుపై-। నెనసి నీవాకు మడిచియ్యగాను।
వనిత నేడటువంటి వలపుదలచే కదా। ఘనమైన తాపమున కాగీనిపుడు॥

చ॥ సిరులు నీ మోముపై చెక్కులొయ్యన చేర్చి। యరమోడ్చి కనురెప్పలలమి యలమి।
తిరువేంకటాచలాధిపుడ నినుగూడియే। పరవశానంద సంపద దేలెనిపుడు॥